క్లుప్తంగా

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


పోలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో, అహల్ సున్నత్ జమాత్ మసీద్ కమిటీ అధ్యక్షుడు యాసిన్ షరీఫ్ ఆధ్వర్యంలో సోమవారం ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అల్లాను ప్రార్థించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించి, ఒకరికి ఒకరు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సందాని, కోశాధికారి షేక్ సలీం, మహమ్మద్ బాషా, జిలాని భారీగా ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నేడు విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం

కొయ్యలగూడెం: ఈ నెల 17న విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కంచి కామాక్షి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సభ్యుడు జువ్వాది శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సంఘ కార్యాలయంలో బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఏలూరులో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్


పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట పోలీస్ కల్యాణ మండపం సమీపంలో పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కన భారత్ పెట్రోల్ కంపెనీకి చెందిన పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ శంకుస్థాపన చేశారు. పెట్రోల్ స్టేషన్ భవన నిర్మాణ డిజైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన, పక్కా కొలతలతో పెట్రోల్, డీజిల్ అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, సీఐలు వైవీ రమణ, ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, కంపెనీ మేనేజర్ ప్రసాద్ రాజవాడే, ఇంజినీరింగ్ అధికారి పుల్లూరి ఆచార్య, ఏలూరు సేల్స్ ఆఫీసర్ బొడ్డు సూర్య, కాంట్రాక్టర్ శ్రీమన్నారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


నిమ్మ తోటను పరిశీలిస్తున్న శ్రీనివాస్

ద్వారకాతిరుమల: మార్కెట్‌లో ధర ఉన్నా.. దిగుబడి లేక నిమ్మ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెంలో రైతు సంఘం నాయకులు సోమవారం పర్యటించి నిమ్మ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కిలో నిమ్మ ధర రూ.50 నుంచి రూ.70 వరకు ఉన్నప్పటికీ, తోటల్లో నిమ్మకాయలు లేక రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్ల వల్ల నిమ్మకాయల దిగుబడి బాగా తగ్గిందన్నారు. దిగుబడి లేని సమయంలో ధర పెంచి రైతులకు మంచి ధర ఇస్తున్నట్లు చేస్తున్న ప్రచారం వల్ల రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. నిమ్మ తోటల్లో తెగుళ్ల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఎరువులు, పురుగుమందులు రైతులకు సబ్సిడీపై అందించాలని కోరారు. గతంలో నష్టాలు తాళలేక అనేక మంది రైతులు నిమ్మ తోటలను తొలగించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిమ్మ రైతులను ఆదుకునే చర్యలు చేపట్టి, నిమ్మ ప్రాసెసింగ్ యూనిట్లను కూడా నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, గుర్రం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ విగ్రహాల నిమజ్జనం

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. పట్టణంలోని పలు కూడళ్లలో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు బొజ్జ గణపయ్యను నిత్యం పూజిస్తున్నారు. స్థానిక వెలమపేట, ఘంటావారివీధి, పాత బస్టాండ్, ఎన్వీఎన్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం డప్పు వాయిద్యాలు, నృత్యాలు, విచిత్ర వేష ధారణలతో గణపతి విగ్రహాలను చింతలపూడి పట్టణంలోని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం నాగిరెడ్డిగూడెం సమీపంలోని తమ్మిలేరులో భక్తుల జయజయ ధ్వానాల మధ్య గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కె.గోకవరంలో...

లింగపాలెం: కె.గోకవరంలో ఆంజనేయస్వామి గుడి సెంటర్, చిన్న రామాలయం సెంటర్, పెద్ద రామాలయం సెంటర్లలో ఏర్పాటు చేసిన మూడు గణనాథుల విగ్రహాలను సోమవారం ఒకేసారి నిమజ్జనం నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. డీజే డప్పులతో గ్రామంలోని యువత అంతా నిమజ్జనంలో పాల్గొన్నారు, వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. వ్యాపారులు, యువకులు, విద్యార్థులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు కులమతాలకు అతీతంగా విఘ్నేశ్వరుని శోభాయాత్రలో పాల్గొన్నారు.

పోలవరం రూరల్: చవితి మహోత్సవాల్లో భాగంగా పోలవరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు 9 రోజుల పాటు నిత్యం పూజలు నిర్వహించారు. సోమవారం ఈ వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లపై గ్రామంలో ఊరేగించి పట్టిసీమ గ్రామంలోని గోదావరిలో నిమజ్జనం చేశారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది రేవు నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షించారు.


ద్వారకాతిరుమల: పసరుకోనేరు వద్ద గణేష్ ఊరేగింపు


ద్వారకాతిరుమల: యాదవ కాలనీ వద్ద మహిళలు, యువకుల కోలాహలం

అట్టహాసంగా ఊరేగింపు

ద్వారకాతిరుమల: వినాయక చవితి వేడుకల్లో భాగంగా 10వ రోజు సోమవారం నిమజ్జన కార్యక్రమాలను యువకులు కోలాహలంగా నిర్వహించారు. అందులో భాగంగా ద్వారకాతిరుమలలో నాలుగు ప్రాంతాల్లో నెలకొల్పిన గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. స్థానిక శ్రీవారి దేవస్థానం హైస్కూల్ ప్రాంతంలో, పసరుకోనేరు వద్ద, యాదవ కాలనీ వద్ద, బ్రహ్మంగారి పుట్ట వద్ద నెలకొల్పిన వినాయక విగ్రహాలకు కమిటీ సభ్యులు ముందుగా పూజాధికాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై విగ్రహాలను ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, తీన్మార్‌డప్పుల నడుమ ఊరేగింపును చేపట్టారు. గ్రామ పురవీధుల్లో ఊరేగుతున్న వినాయక విగ్రహాలకు భక్తులు హారతులు పట్టి, నీరాజనాలు సమర్పించారు. రాత్రి పంగిడిగూడెంలోని పోలవరం కాలువలో వినాయక విగ్రహాలను గణేష్ నామస్మరణ నడుమ నిమజ్జనం చేశారు.


లింగపాలెం: కె.గోకవరంలో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువత సభ్యులు


పోలవరం రూరల్: పట్టిసం రేవులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

ముగిసిన గణేష్ నవరాత్రులు

జంగారెడ్డిగూడెం: గణేష్ నవరాత్రులు ఘనంగా ముగిశాయి. దీంతో 9 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుల విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో సోమవారం గణనాథుల నిమజ్జనానికి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేశారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా పందిళ్ల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని విశేష పూజలు నిర్వహించి, వాహనాలపై ఊరేగింపు నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచా నడుమ యువకుల కేరింతలతో కేకేఎం ఎర్రకాలువ జలాశయానికి నిమజ్జనానికి ఉత్సవ కమిటీ నిర్వాహకులు తీసుకువెళ్లారు.


చింతలపూడి: నగర పంచాయతీలో గణేష్ ఊరేగింపు

సేంద్రియ సాగుతో అధిక లాభాలు


మెట్ట ప్రాంతంలో రైతులు పండిస్తున్న వేరుశనగ పంట


వరి పంట

- రసాయన ఎరువుల వాడకంతో అనర్థాలు
- పంటల్లో కనిపిస్తున్న ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు
- సేంద్రియ సాగే మేలంటున్న అధికారులు

చింతలపూడి: నేడు రైతులు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటను పండించడానికి విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా భూముల్లో పంటలకు కావలసిన పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపించి ముందెన్నడూ లేని విధంగా ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటల్లో కనిపిస్తోంది. ఈ పోషకాలు లోపించినప్పుడు సాగులో మిగతా యాజమాన్య పద్ధతులన్నీ సక్రమంగా పాటించకపోయినా దిగుబడులు తగ్గుతాయి. పంట నాణ్యత కూడా తగ్గే ప్రమాదం ఉంది. అందువలన పంటల్లో సూక్ష్మ పోషక లోపాలు కనిపించినప్పుడు వాటిని సవరించుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించొచ్చు. ఈ లోపాలను అధిగమించడానికి రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఎంచుకుంటే మేలని వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ సూచిస్తున్నారు.

జిప్సంతో అధిక దిగుబడులు

వేరుశనగ పంటలో అధిక దిగుబడులకు జిప్సంను పూత దశలో వేసుకొని భూముల్లో కలియ బెట్టడం వలన వేరుశనగ ఊడలు జిప్సంలోని కాల్షియం, గంధకాన్ని తీసుకుని అధిక దిగుబడులు వస్తాయి. వేరుశనగలో జిప్సం వినియోగం వలన కాయలు గట్టిగా ఉండి కాయ నిండా పప్పు వృద్ధి చెంది గింజల్లో అధిక నూనె శాతం కలిగి ఉంటుంది. ఫలితంగా కాయలు అధిక బరువు కలిగి మంచి ధర పలుకుతాయి. కాబట్టి పూత సమయంలో ఎకరాకు 200 కిలోల చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా వేసుకోవాలి. బీడు, చౌడు భూముల్లో నీరు సరిగా ఇంకదు. గాలి ప్రసరణ తక్కువగా ఉంటుంది. భూమి భౌతిక లక్షణాలు క్షీణించి ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మొక్కల వేర్లు సరిగా వృద్ధి చెందక మొక్కల్లో ఎదుగుదల ఉండదు. ఇలాంటి భూముల్లో జిప్సం వినియోగం వలన నేల గుల్లబారి భూమిలో నీరు ఇంకే స్వభావం పెరిగి మొక్కల వేర్లు బాగా వద్ధి చెందుతాయి. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.

ఎరువుగా జిప్సం వాడాలి



జిప్సం రసాయన నామం. జిప్సంలో 24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉంటుంది. కాల్షియం, గంధకం మొక్కల పెరుగుదలకు అవసరమైన ద్వితీయ శ్రేణి పోషకాలను అత్యంత చౌకగా జిప్సం ద్వారా అందించవచ్చు. ముఖ్యంగా నూనె గింజలు, పప్పుధాన్యాల వంటి పంటల్లో గంధకం ఆవశ్యకత అధికంగా ఉంటుంది. కాల్షియం మొక్కల్లోని జీవ కణాల అంచులు గట్టిగా ఉండటానికి, కణ విభజనకు, వేర్ల అభివృద్ధికి గింజ కట్టడానికి అవసరమవుతుంది. దీని వలన మొక్కలకు చీడ పీడలను ఎదుర్కొనే శక్తి సమకూరుతుంది.

– బి.నాగకుమార్, ఏడీఏ

ముంపు నుంచి బయటపడ్డ పొలాలు


పోలవరంలో ఎగపోటు నీటి ముంపు నుంచి బయటపడ్డ పొలాలు

పోలవరం రూరల్: గోదావరి వరద ఎగపోటు నీరు పూర్తిగా తగ్గడంతో పోలవరం ప్రాంతంలో పొలాలు ముంపు నుంచి బయటపడ్డాయి. గత వారం రోజులుగా కొండవాగుల నీటితో పాటు గోదావరి ఎగపోటు నీరు కూడా తోడు కావడంతో నాట్లు వేసిన వరదనీటిలో మునిగితేలాయి. పొలాల్లో నాట్లు కుళ్లిపోయాయని, మరలా వరినారు దొరికే పరిస్థితి లేదని, అంతేకాక సమయం కూడా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పొలాలు రెండు మూడు సార్లు ముంపునకు గురయ్యాయని వాపోతున్నారు. వరద ముంపు నుంచి బయటపడిన పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేశాం

ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎన్నికల సమయంలో తాను చేసిన 6 వాగ్దానాల్లో ఐదు అమలు చేశామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులైన సందర్భంగా ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వర్జీనియా పొగాకు రైతులకు రూ.110 కోట్ల లబ్ధి చేకూర్చామని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12,500 కోట్ల నిధులు తీసుకొచ్చామని, వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరులో నిలుపుదల సాధించామని, ఏలూరులో జాబ్‌మేళా నిర్వహించి 566 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని వివరించారు. పామాయిల్ దిగుమతులపై 27.5 శాతం సుంకం విధింపు ద్వారా పామాయిల్ రైతులకు టన్నుకు ధర సుమారు రూ.16,500తో పాటు దేశవ్యాప్తంగా వంటనూనె గింజలు పండించే రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. 6వ అంశం త్వరలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడారు.

ఇంకా వరద యాతనే..


ఎద్దెలవాగు వద్ద సోమవారం పడవపై రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు


నీటమునిగే ఉన్న ఎద్దెలవాగు వంతెన

- 18 గ్రామాల్లో వీడని గోదావరి వరద
- ఆ గ్రామాలకు పడవ ప్రయాణమే దిక్కు
- నరకయాతన పడుతున్న గిరిజనం

వేలేరుపాడు: గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు సాధారణ స్థాయికి చేరినా ఇంకా గ్రామాలు వేలేరుపాడు మండలంలోని కొని గ్రామాలకు వరదయాతన తప్పడం లేదు. రహదారులు, వంతెనలు సైతం ఇంకా నీటమునిగే ఉన్నాయి. భద్రాచలం వద్ద సోమవారం 27 అడుగులకు నీటిమట్టం చేరినా వేలేరుపాడు మండలంలో గ్రామాల్లో ముంపు ప్రభావం తొందరగా తగ్గడం లేదు. మండలంలోని 18 గిరిజన గ్రామాలు 15వ రోజు కూడా జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి రుద్రమకోట వెళ్లే రహదారి సోమవారం బయటపడింది. ఇంకా మేళ్ళవాగు, టేకూరు వాగుల వంతెనలు బయటపడ్డాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో ఎద్దెలవాగు, వాగు వంతెన మాత్రమే ఇంకా నీటిలోనే మునిగిపోయి ఉంది. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల గిరిజనులు గత పదిహేను రోజులుగా పడవలపైనే ప్రయాణిస్తూ నరకయాతన పడుతున్నారు.

పరిహారంగా రూ.50 లక్షలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు సమీపంలోని శ్రీ విజయ దుర్గ ట్రేడర్స్ కంపెనీలోని హైడ్రాలిక్ మిషన్ (బేల్ ప్రెస్) మెషీన్‌లో పడి దారుణంగా మృతి చెందిన బీహార్ వలస కార్మికుడు పుల్సార్ శర్మ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మృతుడు 15 సంవత్సరాల నుంచి ఆ కంపెనీలో పనిచేస్తున్నాడని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు తెలిపారు. సోమవారం వారు పూల్సార్ శర్మ మృతి చెందిన హైడ్రాలిక్ మెషీన్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడు చనిపోయిన తీరు చూస్తుంటే.. అది ప్రమాదవశాత్తూ కాదని, ఉద్దేశపూర్వకంగానే చంపారనే ఆలోచన కలుగుతుందని తెలిపారు. కంపెనీ యాజమాన్యం వలస కార్మికుల చట్టం లేదా కార్మిక చట్టాలేమీ అమలు చేయడం లేదని ఆరోపించారు. కంపెనీలో దాదాపు 100 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నప్పటికీ.. వారెవరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పని గంటలు, వారాంతపు, పండుగ సెలవులు తదితర సౌకర్యాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుడు మృతిపై భిన్న కోణాల్లో దర్యాప్తు చేయించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద బాధితులకు సాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అమీనాపేట సీఎస్ఐ హోలీ ట్రినిటీ గోల్డెన్ చర్చి నిర్వాహకులు విజయవాడలో వరద బాధితులకు ఆపన్నహస్తం అందించారు. రూ.లక్షకు పైబడిన వ్యయంతో చీరలు, దుప్పట్లు, తువ్వాళ్లు, వాటర్ బాటిల్స్, టాయిలెట్ ఐటమ్స్, బిస్కెట్లు తదితర వస్తువులను విజయవాడ ముస్తాబాదకు సోమవారం తరలించారు. వస్తువుల వాహనాన్ని పాస్టర్ ఆనందకుమార్ ప్రారంభించారు. విజయవాడ తరలివెళ్లారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): నరసాపురంలో దివ్యాంగురాలైన యువతిపైన దాడి చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వికలాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. 2016 దివ్యాంగుల చట్టం సెక్షన్ 92 ఏ ప్రకారం దివ్యాంగురాలిపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరింది. బాధిత దివ్యాంగురాలికి న్యాయం చేయాలని వికలాంగ హక్కుల జాతీయ వేదిక గౌరవాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా అధ్యక్షుడు జయరాజు డిమాండ్ చేశారు.

సంక్షేమ బోర్డులో సభ్యత్వం పొందండి

జంగారెడ్డిగూడెం: భవన నిర్మాణ కార్మికులందరూ సంక్షేమ బోర్డులో సభ్యత్వం పొందాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల ముఖ్య నాయకుల సమావేశం మంచిలి రాజు అధ్యక్షతన జరిగింది. కేవీ రమణ మాట్లాడుతూ నిలుపుదల చేసిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దాని ప్రకారం ఏలూరు లేబర్ ఆఫీసులో గత గురువారం కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ కార్డులు ఉన్న కార్మికులు రెన్యువల్ చేసుకోవాలని, కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని, త్వరలోనే బోర్డు పునరుద్ధరించే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో సంక్షేమ బోర్డులో కార్డులు కలిగి ఉన్న వారే భవన నిర్మాణ పనులు చేయడానికి అర్హులవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి రాంబాబు, తియ్యల గణేష్, బాలిన ధర్మరాజు, మొల్లేటి శ్రీనివాస్, మంచిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ శ్రీనివాస్‌కు నివాళి


అశోక్‌కు నివాళులర్పిస్తున్న కారుమూరి నాగేశ్వరరావు, సునీల్ కుమార్, పార్టీ శ్రేణులు


అశోక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కామవరపుకోట: మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి వైఎస్సార్‌సీపీకి, ఈ ప్రాంత ప్రజలకు తీర్చలేనిలోటని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కళ్ళచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక్ శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీకి విధేయుడుగా ఉంటూ, పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారని, ఈ ప్రాంత ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి అన్ని వేళల అందుబాటులో ఉంటూ సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, అశోక్ వైఎస్సార్‌సీపీకి చేసిన కృషి, ప్రజల కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ వారు విచారం వ్యక్తం చేశారు.